

ఉమ్మడి జిల్లాలో 329 ఉపాధ్యాయ ఖాళీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో 329 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్టు ప్రభుత్వం తేల్చింది. ఇందులో సెకండరీగ్రేడ్ పోస్టులు 101, స్కూలు అసిస్టెంట్ ఖాళీలు 133, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులు 95 ఉన్నాయి. ఈ మేరకు బుధవారం పాఠశాల విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లాల వారీగా ఖాళీల వివరాలు వెల్లడించారు. అయితే మేనేజ్‌మెంట్‌ల వారీగా ఖాళీలు, స్కూలు అసిస్టెంట్ పోస్టుల్లో సబ్జెక్టుల వారీగా వివరాలు ఇంకా ప్రకటించలేదు. ఈనెల 12వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలుకానున్నందున ఆ రోజు సబ్జెక్టు వారీగా ఖాళీలు వెల్లడిస్తారని విద్యా శాఖ వర్గాలు తెలిపాయి.

భరోసా ఇవ్వని బడ్జెట్!





దేవరాపల్లి మండలంలో ఆధునీకీకరణకు నోచుకోని రైవాడ ఎడమ కాలువ

సాగునీటి రంగానికి మళ్లీ మొండిచేయి



- సుజల స్రవంతి పథకానికి కేటాయింపులపై కొరవడి స్పష్టత
- పెద్దేరు, రైవాడ, కోనాం ప్రాజెక్టులకు నిధుల ఊసేలేదు
- జిల్లావాసులను తీవ్ర నిరాశపరిచిన 'బుగ్గన' బడ్జెట్

అనకాపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024-25 సంవత్సరానికి సంబంధించి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ జిల్లా ప్రజలను తీవ్రనిరాశకు గురిచేసింది. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు మంత్రి ... మిగతా 8వ పేజీలో

అన్ని వర్గాలకూ నిరాశే!



వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసినట్టు చెబుతున్న వైసీపీ ప్రభుత్వం.. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు ఎందుకు కేటాయించలేదో రైతులకు సమాధానం చెప్పాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఇంతవరకు విడుదల చేలేదు. రానున్న ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి నవరత్నాల గురించి బడ్జెట్‌లో ఊదరగొట్టారు. నిరుద్యోగుల ఉపాధి అవకాశాల కోసం ఎటువంటి కేటాయింపులు జరగలేదు. **- బుద్ధ నాగజగదీశ్వరరావు,** టీడీపీ జిల్లా అధ్యక్షుడు

జిల్లాకు మొండిచేయి



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుధవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో జిల్లాకు ఏ రంగంలో కూడా ప్రత్యేకంగా కేటాయింపులు లేవు. ముఖ్యంగా సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకపోవడం బాధాకరం. గత నాలుగేళ్ల మాదిరిగానే ఈసారి కూడా మొండిచేయి చూపారు. మూతపడిన సహకార షుగర్ ఫ్యాక్టరీల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. సంక్షేమానికి అరకొరగానే నిధులు కేటాయించారు.
- లోకనాథం, సీపీఎం జిల్లా కార్యదర్శి

కేటాయింపులకు, ఖర్చులకు పొంతన లేదు



ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో కేటాయింపులన్నీ సంక్షేమ పథకాలకు సంబంధించినవే. బడ్జెట్‌లో పేర్కొన్నా అంకెలకు, వాస్తవంగా ఖర్చు చేసిన నిధులకు పొందన లేదు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అంకెల గారడీతో ప్రజలను మోసం చేసేవిధంగా ఉంది. ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల రాష్ట్రం మరింత కుదేలయ్యే పరిస్థితి ఉంది.
దూలం గోపి, జనసేన నాయకుడు, అనకాపల్లి

బడ్జెట్‌లో కొత్తదనం లేదు



రాష్ట్ర బడ్జెట్‌లో ఎటువంటి కొత్తదనం లేదు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, వాటి కేటాయింపులతోనే బడ్జెట్‌ను నింపేశారు. జిల్లాలో వ్యవసాయం, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా ఎటువంటి కేటాయింపులు జరగలేదు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన బడ్జెట్‌లా వుంది.
ఏఎస్ఎన్ మూర్తి,
అర్థశాస్త్ర అధ్యాపకుడు, ఏఎంఏఎల్ కళాశాల, అనకాపల్లి

సుజల స్రవంతిపై అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు

పనులు పురోగతిలో ఉన్నాయంటూ ఆర్థిక మంత్రి ప్రకటన

- ప్రాజెక్టుకు ఐదేళ్లలో పైసా విదల్చని వైసీపీ ప్రభుత్వం
- కనీసం భూ సేకరణకు కూడా నిధులు విడుదల చేయని వైనం



తాళ్లపాలెం వద్ద ఐదేళ్ల నుంచి సుజల స్రవంతి కాలువ పరిస్థితి ఇదే!

విశాఖపట్నం/ అనకాపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): 'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి' ప్రాజె క్టుపై అసెంబ్లీ సాక్షిగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అబ ద్ధం ఆడేశారు. ప్రాజెక్టు పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి ప్రకటించడం ప్రజలను మోసపుచ్చడమేనని విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఐదేళ్లలో సుజల స్రవంతి ప్రాజెక్టుకు పైసా విదల్చలేదు. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రూ.6.5 కోట్లు కూడా ఇంతవరకూ చెల్లించలేదు. కనీసం ప్రధాన కాలువ నిర్మాణానికి అవసరమైన భూమిని అప్పగించాలని కాంట్రాక్టర్ కోరినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు. భూసేకరణకు అనకాపల్లిలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటుచేశారు. కాలువల నిర్మాణం నిమిత్తం అనకాపల్లి జిల్లాలో 6,435 ఎకరాల సేకరించాల్సి ఉండగా.. 1,157 ఎకరాలకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీచేశారు. అయితే ఆ భూమికి సంబంధించి అవార్డు ప్రకటించి, తరువాత రైతులకు పరిహారం ఇవ్వాలి. ఇందుకు తొలివిడతగా రూ.900 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా ఇప్పటివరకూ రూపాయి విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో భూసేకరణకు సర్వే పనులు సాగుతున్నా నిధులు మాత్రం కేటాయించలేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉండగా..ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పడంపై రైతులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. కాగా రూ.7,500 కోట్లతో ప్రాజెక్టు నిర్మించాలని సుమారు 14 ఏళ్ల క్రితం ప్రతిపాదించారు. ప్రస్తుతం వ్యయం రూ.17,050 కోట్లకు చేరింది.

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని చావుదెబ్బ తీయాలి

- జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు పిలుపు



నాగబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 7: రాష్ట్రం 20 ఏళ్లపాటు కోలుకోలేని విధంగా వైసీపీ పాలకులు నాశనం చేశారని, ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ పార్టీ అధికారంలోకి రాకూడదని అన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. బుధవారం నర్సీపట్నంలో పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం ఎంత దుర్మార్గంగా పని చేస్తున్నదో అందరూ చూస్తున్నారని, సంక్షేమ పథకాల పేరుతో విపరీతంగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఏ పార్టీ అధికారంలో వున్నా ప్రజలకు సంక్షేమ పథకాలు అందాల్సిన బాధ్యత ఉందని, సంక్షేమ పథకాల జపం చేస్తూ రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా, వ్యాపారాలు జరగండా సర్వనాశనం చేశారని విమర్శించారు. ఏ రాజకీయాన్ని మనపై ప్రయోగించి 2019 ఎన్నికల్లో దెబ్బతీశారో, అదే రాజకీయంతో తిరిగి వైసీపీని చావు దెబ్బతీయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో టీడీపీతో కలిసి వెళుతున్నందున రాజకీయంగా ఆచీతూచీ మాట్లాడాలని జనసైనికులకు సూచించారు. నర్సీపట్నం నియోజవర్గంలో టీడీపీ అభ్యర్థి విజయానికి జనసైనికులు సంపూర్ణ సహకారం అందించాలని పిలుపునిచ్చారు. నియోజవర్గంలో నెలకొన్న ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ, మునిసిపాలిటీ డంపింగ్ యార్డు, తాండవ రిజర్వాయర్ గేట్ల లీకేజీ, తదితర సమస్యలను ప్రస్తావిస్తూ.. టీడీపీ-జనసేన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వీటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలి ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, పార్టీ ఉత్తరాంధ్ర వ్యవహారాల ముఖ్య ప్రతినిధి సుందరపు సతీశ్‌కుమార్, నర్సీపట్నం ఇన్‌చార్జి సూర్యచంద్ర, కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జనసేన నాయకులతోపాటు టీడీపీ నాయకులు దనిమిరెడ్డి మధు, మురళి తదితరులు నాగబాబుని కలిసి జ్ఞాపికను అందజేసి సన్మానించారు.

నాగబాబు 10న అనకాపల్లి రాక

అనకాపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఈ నెల 10న అనకాపల్లి నియోజకవర్గానికి రానున్నారని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు బుధవారం తెలిపారు. శనివారం ఉదయం పది గంటలకు ఇక్కడ పార్టీ కార్యాలయంలో జరగనున్న సమావేశంలో పాల్గొంటారని, నియోజకవర్గంలోని అన్ని కమిటీల ప్రతినిధులు, సభ్యులు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

బతికున్నా.. ఓట్లు లేవు!

నిక్షేపంగా ఉన్న వారి పేర్లు జాబితాల నుంచి తొలగింపు



సబ్బవరం పీఎస్ 33, ఓటరు సంఖ్య 286లో వున్న గెడ్డం పాప ఏడాది క్రితం చనిపోయూరు. కానీ జాబితాలో పేరు వుంది. కానీ నిక్షేపంగా వున్న ఆమె భర్త గెడ్డం కృష్ణ (ఓటరు సంఖ్య 288) పేరును జాబితా నుంచి తొలగించారు


- మరోపక్కచనిపోయి చాలా కాలమైనా.. కొనసాగుతున్న ఓట్లు
- తప్పుల తడకగా సబ్బవరం ఓటరు జాబితాలు

సబ్బవరం, ఫిబ్రవరి 7 : మేజరు పంచాయితీ సబ్బవరంలోని పోలింగ్ కేంద్రం 33కు చెందిన ఓటరు జాబితాల్లో పలు తప్పులు దొర్లాయి. చనిపోయిన వారిలో చాలా మంది పేర్లను ఓటరు జాబితాలో నుంచి తొలగించలేదు. మరోవైపు బతికున్న వారికి ఓటు హక్కు లేకుండా చేశారు. అదే విధంగా ఓటరు పేరు ఒకరిదైతే.. ఫొటో మరొకరిది వుంది.

సబ్బవరం పోలింగ్ స్టేషన్ 33లో సీరియల్ నంబరు 286లో (ఎక్స్‌జేవీ 2644896) గెడ్డం పాప పేరు వుంది. ఈమె మృతిచెంది ఏడాది అవుతున్నది. కానీ జాబితాలో నుంచి పేరు తొలగించలేదు. ఈమె భర్త గెడ్డం కృష్ణ ఓటరు సీరియల్ నంబరు 288 (ఎక్స్‌జేవీ 2644920). కానీ ఇతని ఓటు తీసేశారు(జాబితా 'డెలిటెడ్' అని స్టాంపు వేశారు.). ఇదే పోలింగ్ కేంద్రం సీరియల్ నంబరు 541లో అల్లం వెంకటసూర్యారావుకు ఓటు ఉంది. ఇతను బతికే ఉన్నప్పటికీ ఓటును తొలగించారు. ఇక సీరియల్ నంబరు 77లో కుంచా సాధూరావు ఫొటో బదులుగా అతని కుమారుడు కుంచా ప్రసాద్ (సీరియల్ నంబరు 530) ఫొటో పెట్టారు.

చనిపోయిన వారికి ఓట్లు!

ఇదే పోలింగ్ స్టేషన్‌లో నాగఅప్పారావు తనికెళ్ల (సీరియల్ నంబరు 66), గిరిధర్‌ప్రసాద్ వల్లభజోస్యుల (సీరియల్ నంబరు 61), సత్యవతి కుచ్చర్ల (సీరియల్ నంబరు 70), భవానీ గుడివాడ (సీరియల్ నంబరు 91), లక్ష్మీకాంతం తిరుక్కోవెల (సీరియల్ నంబరు 96), కామేశ్వరరావు జల్లి (సీరియల్ నంబరు 137), పద్మ ఆకాసాపు (సీరియల్ నంబరు 240), సురేశ్ ఆకాసాపు (సీరియల్ నంబరు 243), వీవీఎస్ సత్యనారాయణ (సీరియల్ నంబరు 317), పాల్ లారెన్స్ కంచెర్ల (సీరియల్ నంబరు 324), వెంకటనరసింహారావు పేల (సీరియల్ నంబరు 327), పాపయ్యరాజు లింగం (సీరియల్ నంబరు 328), వలసల పరంజాడబీడు (సీరియల్ నంబరు 352), కన్నారావు సారిపల్లి (సీరియల్ నంబరు 592), ప్రకాశ్ గండి (సీరియల్ నంబరు 742), గోపాలకృష్ణ కుక్కల (సీరియల్ నంబరు 877), వంకా శివప్రసాద్ (సీరియల్ నంబరు 811)... వీరంతా చనిపోయినప్పటికీ ఓటరు జాబితాలో పేర్లు వుండడం విశేషం. వెంకట సత్యదుర్గారావుకు సీరియల్ నంబరు 527లో (కేవైవీ 1231497), సీరియల్ నంబరు 442లో (ఎక్స్‌జేవీ 1077148).. రెండుచోట్లా ఓట్లు వున్నాయి. మీర కురందాస్ సీరియల్ నంబరు 255 (ఎక్‌జేవీ 0078436) నిక్షేపంగా వున్నప్పటికీ ఓటు తీసేశారు.



సబ్బవరం పీఎస్ 33లో అల్లం వెంకటసూర్యారావు బతికే వున్నప్పటికీ ఆయన ఓటు తీసేశారు

వితంతు పింఛన్ మంజూరుకు పాట్లు

- 10 నెలలుగా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు వినతులు
- ఒకరిపై మరొకరు సాకులు చెబుతున్న ప్రభుత్వ ఉద్యోగులు
- తీవ్రమనోవేదన చెందుతున్న వృద్ధురాలు



అనిమిరెడ్డి సన్యాసమ్మ

నాతవరం, ఫిబ్రవరి 7: 'కులం చూడం.. మతం చూడం.. రాజకీయాలు అసలే చూడం. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నాం' అంటూ తరచూ గొప్పలు చెప్పుకునే వైసీపీ పాలకుల మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిస్థితులకు పొంతన వుండడం లేదు. అన్ని అర్హతలు వున్న వితంతువైన ఓ వృద్ధురాలు సంక్షేమ పింఛన్ కోసం పది నెలల నుంచి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. గ్రామ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్ వరకు అందరినీ కలిసి తన గోడు వెళ్లబోసుకున్నది. అయినా సరే ఏ ఒక్కరూ కరుణించలేదు.. ఇంతవరకు పెన్షన్ మంజూరు కాలేదు. ఈమె తెలుగుదేశం పార్టీ మద్దతు ఇచ్చే కుటుంబానికి చెందిన మహిళ కావడంతోనే పింఛన్ మంజూరు చేయడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండల కేంద్రమైన నాతవరం గ్రామానికి చెందిన అనిమిరెడ్డి అప్పలనాయుడుకు గతంలో వృద్ధాప్య పింఛన్ వుండేది. ఇతను గత ఏడాది మార్చి నెలల అనారోగ్యంతో మృతిచెందాడు. తరువాత ఇతని భార్య సన్యాసమ్మ(68) గ్రామ సచివాలయంలో తన భర్త మరణ ధ్రువీకరణపత్రం తీసుకుని, ఏప్రిల్‌లో వితంతు పింఛన్ కోసం గ్రామవలంటీరు చిటికెల సత్యవతి ద్వారా గ్రామ సచివాలయంలో దరఖాస్తు అందజేసింది. తరువాత పలుమార్లు సచివాలయానికి వెళ్లి పింఛన్ మంజూరైందేమోనని వాకబు చేసింది. దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామని, జిల్లా స్థాయిలోనే పింఛన్ మంజూరు చేస్తారని సచివాలయం సిబ్బంది చెప్పారు. దీంతో ఆమె కొంతకాలంపాటు వేచిచూసింది. నెలలు గడుస్తున్నా పింఛన్ మంజూరు కాకపోవడంతో గత నెలలో అనకాపల్లి వెళ్లి స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చింది. దీనిని ... మిగతా 8వ పేజీలో

పట్నంలో ట్రాఫిక్ కష్టాలు

చింతపల్లి రోడ్డులో అధికంగా వాహనాల రద్దీ

- అబిడ్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఇరుకుగా మారిన రహదారి
- ఇరువైపులా వాహనాల నిలుపుదలతో సమస్య తీవ్రతరం



నర్సీపట్నం-చింతపల్లి రోడ్డులో కృష్ణాబజార్ కూడలి వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన 108 అంబులెన్స్

- అంబులెన్స్‌లకు సైతం తప్పని ట్రాఫిక్ జామ్
- పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు వినతి

నర్సీపట్నం, ఫిబ్రవరి 7: మునిసిపాలిటీలోని నర్సీపట్నం-చింతపల్లి రోడ్డులో అబిడ్ సెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు రహదారి ఇరుకుగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. కృష్ణాబజార్ సెంటర్ నుంచి ఐదు రోడ్ల జంక్షన్‌కు వెళ్లే మార్గం చిన్నదిగా ఉంది. వంటనూనెలు, కిరాణా హోల్ సేల్ దుకాణాలు, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు ఆఫీసులు, ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్ బ్యాంకు, ఆస్పత్రులు ఈ రోడ్డులోనే ఉన్నాయి. ఆయా దుకాణాలు, వ్యాపార సముదాయాల వద్ద వాహనాల నిలుపుదలకు ప్రత్యేకంగా స్థలాలు లేవు. దీంతో వివిధ పనుల నిమిత్తం ఇక్కడకు వచ్చి వారు తమ వాహనాలను రోడ్డు మీదనే పార్కింగ్ చేస్తున్నారు. ఇరువైపులా వాహనాల నిలుపుదల కారణంగా రోడ్డు మరింత తగ్గిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆర్టీసీ బస్సులు, లారీలు, వ్యాన్‌లు మలుపు తిరిగేటప్పుడు కృష్ణాబజార్ సెంటర్ వద్ద ట్రాఫిక్ నిలిచి పోతున్నది. భారీ వాహనాల రాకపోకలకు ఈ రోడ్డు అనుకూలం కాకపోయినప్పటికీ హోల్‌సేల్ దుకాణాలు ఉండడంతో రాక తప్పడంలేదు. మరోవైపు హోల్‌సేల్ దుకాణాల వద్ద తోపుడు బండ్లు, ఆయిల్ డబ్బాలు రోడ్డు మీదనే ఉంచుతుండడంతో వాహనాలు రాకపోకలకు అడ్డంకులుగా మారాయి. కృష్ణాబజార్‌కు, పోలీస్ స్టేషన్‌కి మధ్యలో మెయిన్ రోడ్డులో పక్కపక్కనే రెండు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. మందుబాబులు తమ ద్విచక్ర వాహనాలను రోడ్డు మీదనే పార్కింగ్ చేసి మద్యం కొనుగోలు చేయడానికి వెళుతుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది.

అంబులెన్స్‌లకూ తప్పని ఇబ్బంది

నర్సీపట్నం-చింతపల్లి రోడ్డులో ఏరియా ఆస్పత్రి ఉండడంతో అంబులెన్స్‌ల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. అంబులెన్స్‌లో రోగిని తీసుకువస్తున్నప్పుడు ట్రాఫిక్ జామ్ అయితే వెంట వచ్చే సహాయకుల ఆందోళన వర్ణనాతీతం. హారన్ కొట్టినా, సైరన్ మోగుతున్నా.. అంబులెన్స్‌కు దారి ఇచ్చే పరిస్థితి లేకపోయింది. కళాశాలలు, పాఠశాలలకు వాహనాల్లో వెళ్లే విద్యార్థులు కూడా ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలో పాత బస్టాండ్, ఆర్టీసీ కాంపెక్స్ కంటే చింతపల్లి రోడ్డులోనే ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుందని, అందువల్ల పోలీసులు అబిడ్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ట్రాఫిక్ జామ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహా మాయ

17 రోజుల పాటు కార్మికులు సమ్మెల్లో ఉన్నప్పుడు పారిశుధ్య నిర్వహణకు రూ.3.2 కోట్లు ఖర్చయిందట

- జీవీఎంసీ పాలకుల లెక్కలు...స్టాండింగ్ కమిటీ ఆమోదం
- ఎన్నికల కోడ్ వస్తుందని ఏకబిగిన 141 అంశాలకు క్లియరెన్స్
- మద్దిలపాలెం నుంచి ఆశీల్‌మెట్ట వరకూ రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణం

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు (అవుట్‌సోర్సింగ్) సమ్మెలో ఉన్నప్పుడు (17 రోజులు) ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం రూ.3.2 కోట్లు ఖర్చు చేసినట్టు జీవీఎంసీ పాలకులు లెక్కలు చూపించారు. ఈ మేరకు బిల్లుల చెల్లింపునకు స్టాండింగ్ కమిటీ కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఏ క్షణంలోనైనా ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చేస్తుందనే భావనతో అధికారులు సమావేశం ఎజెండాలో ఏకంగా 141 అంశాలను చేర్చేశారు. వీటన్నింటినీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించేయడం అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం డిసెంబరు 26 నుంచి జనవరి 12వ తేదీ వరకూ సమ్మె చేశారు. ఆ సమయంలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా నిలిచిపోయింది. ప్రత్యామ్నాయంగా తాత్కాలిక కూలీలు, వాహనాలను ఏర్పాటుచేసినా కార్మికులు అడ్డుకున్నారు. నగరంలో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి పారిశుధ్యం మరీ క్షీణించడంతో కార్మికుల సమ్మె ముగియడానికి ముందు మూడు రోజులు మాత్రం కొంతమేర వాహనాలు, జేసీబీలతో చెత్తకుప్పలను తొలగించారు. అయితే సమ్మె కాలంలో తాత్కాలిక కూలీలు, జేసీబీలు, టిప్పర్లను ఏర్పాటుచేశామని, అందుకోసం రూ.3.2 కోట్లు ... మిగతా 8వ పేజీలో



మాట్లాడుతున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

క్రైం... crime news

అతిగా మద్యం తాగి యువకుడి మృతి

కశింకోట, ఫిబ్రవరి 7 : కశింకోటకు చెందిన ఓ వ్యక్తి అతిగా మద్యం తాగి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాలివి. కశింకోట పూసర్ల వీధికి చెందిన ధర్మిశెట్టి మోహన్(30) గత మూడు రోజులుగా తన స్నేహితుడైన శ్రీనివాసరావుతో కలిసి మద్యం తాగుతున్నాడు. సోమవారం ఉదయం 7 గంటలకు కశింకోట నుంచి యానాం వెళ్లి అప్పటి నుంచి మద్యం తాగుతూ సొంత గ్రామమైన కశింకోటకు బుధవారం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మద్యం తాగి కశింకోట వద్ద ఉన్న రైల్వే ట్రాక్‌కు కొద్దిపాటి దూరంలో సేద తీరారు. సాయంత్రం 5గంటల ప్రాంతంలో మోహన్‌ను స్నేహితుడైన శ్రీనివాసరావు ఎంత లేపినప్పటికీ మేల్కోకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి


రవికుమార్ మృతదేహం

లంకెలపాలెం, ఫిబ్రవరి 7: అనుమానాస్పదంగా ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. జీవీఎంసీ 85వ వార్డు పరిధి మంత్రిపాలెం సమీపంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకొంది. దీనికి సంబంధించి పరవాడ ఎస్‌ఐ సురేశ్ తెలిపిన వివరాలిలా వున్నాయి. కాకినాడ ప్రాంతానికి చెందిన తుమ్మల రవికుమార్(48) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్థానికంగా గల యార్డులో లారీని నిలిపివేశాడు. అక్కడికి సమీపంలో ప్రధాన రహదారి పక్కనే తలకు బలమైన గాయంతో మృతి చెంది ఉన్నాడు. స్థానికులు గుర్తించి పరవాడ పోలీసులు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనాస్థలిని పరిశీలించారు. అతని తల, శరీరంపై గాయాలున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడం వల్లే తలకు బలమైన గాయం తగిలి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎలమంచిలి, ఫిబ్రవరి 7: రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మునిసిపాలిటీ ఏఎస్ఆర్ కాలనీకి చెందిన కోట్ని సత్తిబాబు(44) గత నెల 24వ తేదీన ఏఎస్ఆర్ కాలనీలోని యానాద్రమ్మ ఆలయం వద్ద ప్రమాదానికి గురయ్యాడు. అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

అప్పులతో కౌలు రైతు ఆత్మహత్య


అప్పలరాజు (ఫైల్ ఫొటో)

పద్మనాభం, ఫిబ్రవరి 7: విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో అప్పులు తీర్చలేక కౌలు రైతు ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఏఎస్‌ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం...గ్రామానికి చెందిన పి.అప్పలరాజు (41) స్థానికంగా రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని బొప్పాయి తోట వేసి, లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టారు. పంట దెబ్బతినడంతో అనుకున్న దిగుబడి లేక నష్టాలు వచ్చాయి. దీంతో చేసిన అప్పులు తీర్చలేక దిగులుతో ఈనెల ఐదో తేదీన పొలంలోనే పురుగుల మందు తాగారు. ఈ విషయాన్ని గమనించిన సమీపంలోని రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు విజయనగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం అప్పలరాజు మృతిచెందారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ సీహెచ్ శ్రీధర్ కేసు నమోదు చేశారు.

115 మద్యం బాటిళ్లు స్వాధీనం

» ప్రభుత్వ మద్యం దుకాణం సూపర్‌వైజర్ అరెస్టు


పట్టుబడిన మద్యం బాటిళ్లతో అధికారులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7: మద్యం బాటిళ్లను రవాణా చేస్తూ మద్యం దుకాణం సూపర్‌వైజర్ మంగళవారం రాత్రి పోలీసులకు పట్టుబడ్డాడు. అతని నుంచి పోలీసులు 115 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్ఈబీ సీఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. స్థానిక స్టేషన్‌రోడ్డులోని వెంకటేశ్వర థియేటర్ సమీపాన ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో కె.గణేశ్ సత్యకీర్తి సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ, సెబ్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ ఆదేశాల మేరకు దాడులు చేయగా, వేరొక మద్యం దుకాణంలో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్న జశ్వంత్‌కు మద్యం అమ్మే క్రమంలో గణేశ్ సత్యకీర్తిని పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటనలో జశ్వంత్ పరారీలో ఉన్నాడు. గణేశ్ సత్యకీర్తిని తమ సిబ్బందితో అదుపులోకి తీసుకుని 115 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. దీని విలువ సుమారు రూ.17,500లు ఉంటుందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఆరు మద్యం సీసాలు స్వాధీనం

ఎలమంచిలి, ఫిబ్రవరి 7: ఎలమంచిలి బస్టాండ్ జంక్షన్ వద్ద ఆరు మద్యం సీసాలతో ఓ వ్యక్తి పట్టుబడినట్టు పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు. మునగపాక మండలం రామగిరికి చెందిన చిలుకు మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

40 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

రావికమతం, ఫిబ్రవరి 7: నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. మండలంలోని మరుపాక శివారులో నాటుసారా తయారు చేస్తున్నట్టు అందిన సమాచారంతో బుధవారం సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామన్నారు. 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, సారా తయారీకి సిద్ధం చేసిన మూడు వేల లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశామన్నారు. .

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి కేసులో నిందితుడి అరెస్టు


వాసిరెడ్డి శేఖర్

నర్సీపట్నం, ఫిబ్రవరి 7: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రుత్తల రత్నమాధురి మృతి కేసులో నిందితుడు నాతవరం మండలం వెన్నలపాలెం గ్రామానికి చెందిన వాసిరెడ్డి శేఖర్‌ను అరెస్టు చేసినట్టు సీఐ కాంతికుమార్ బుధవారం తెలిపారు. రత్నమాధురిని ప్రేమించి శారీరంగా కలిసి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని, విష ప్రయోగం చేసి ఆమె చావుకు కారణమయ్యాడని మృతిరాలి తల్లి, సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాసిరెడ్డి శేఖర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని, అనంతరం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	108.00
లైవ్ ధర	128.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	236.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

జంబల్లోవ తోటల్లో పేకాట డెన్!

» రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు జూదం
» చుట్టుపక్కల మండలాల నుంచి రాక
» నిత్యం రూ.15-20 లక్షల మేర చేతులు మారుతున్న నగదు
» పోలీసులు వస్తుంటే సమాచారం ఇవ్వడానికి యువకులతో పహారా
» సులువుగా తప్పించుకునేలా ఏర్పాట్లు

కోటవురట్ల, ఫిబ్రవరి 7: కోటవురట్ల మండలం రామచంద్రపురం శివారు అల్లుమియాపాలెం సమీపంలోని జంబల్లోవ తోటల్లో పేకాట స్థావరాన్ని నిర్వహిస్తున్నారు. కోటవురట్లతోపాటు చుట్టుపక్కల మండలాల నుంచి రోజూ పలువురు జూదరులు ఇక్కడి వస్తున్నారు. పోలీసులు దాడులు చేస్తే.. పట్టుబడకుండా సురక్షితంగా పారిపోయేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇక్కడ పేకాట నిర్వహిస్తున్న వారికి వైసీపీ నేతల అండదండలు వుండడంతో పోలీసులు చూసీచూడనట్టుగా వుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కోటవురట్ల మండలం రామచంద్రపురం శివారు అల్లుమియాపాలెం అటవీ ప్రాంతంలో సంక్రాంతి పండుగకు వారం రోజుల ముందు పేకాట డెన్ ప్రారంభించారు. జూదం ఆడే ప్రాంతానికి రెండు మార్గాల ద్వారా వెళ్లవచ్చు. ఒకవైపు ఆర్అండ్‌బీ రోడ్డునుంచి అల్లుమియాపాలెం గిరిజన గ్రామానికి వెళ్లే రహదారికి కుడివైపు ఒక ప్రైవేటు గెస్ట్‌హౌస్ పక్క నుంచి కాలి బాట వుంది.


పేకాట డెన్ వద్దకు వెళ్లడానికి మరో కాలిబాట


రోడ్డుకు ఎడమ వైపు వున్న ఈ కాలిబాటే పేకాట స్థావరానికి దారి!

ఈ మార్గంలో నుంచి ద్విచక్ర వాహనాలపై జంబల్లోవ తోటల్లోని పేకాట స్థావరానికి చేరుకుంటుంటారు. మరొక దారి నూకాలతల్లి గుడి దాటిన తరువాత మామిడితోట పక్క నుంచి వుంది. ఇక్కడ పేకాట ఆడటానికి కోటవురట్లతోపాటు ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట, తుని మండలాల నుంచి రోజూ 40 నుంచి 50 మంది వరకు జూదరులు వస్తుంటారు. పేకాట డెన్ నిర్వహిస్తున్న వ్యక్తి, అందరి వద్ద నుంచి సెల్‌ఫోన్లు తీసుకుని తన వద్ద ఉంచుకుంటాడు. ఒకవేళ పోలీసులు దాడులకు వస్తుంటే.. ముందుగానే సమాచారం అందేలా రెండు మార్గాల వద్ద ఇద్దరు యువకులు పహారా కాస్తుంటారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పేకాట ఆడుతున్నారు. నిత్యం రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు చేతులు మారుతున్నట్టు తెలిసింది. పోలీసులు వస్తుంటే.. పహారా వున్న వ్యక్తులు వెంటనే డెన్ నిర్వాహకుడికి ఫోన్ చేసి సమాచారం అందిస్తారు. దీంతో ఇతను జూదరులను అప్రమత్తం చేసి పోలీసులకు దొరక్కుండా పారిపోయేలా సహకరిస్తుంటాడు. పహారా కాసే యువకులకు ఒక్కొక్కరికి రోజుకు రూ.2 వేల చొప్పున కూలి రూపంలో చెల్లిస్తున్నట్టు తెలిసింది. కాగా అల్లుమియాపాలెం సమీపంలోని జంబల్లోవ తోటల్లో పేకాట డెన్ నిర్వహిస్తున్న విషయాన్ని ఎస్‌ఐ రమణయ్య 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. ఆ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో పలుమార్లు దాడులు చేశామని, కానీ జూదరులకు ముందుగానే సమాచారం రావడంతో పారిపోతున్నారని చెప్పారు.

పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా చేపట్టేందుకు సిద్ధం

» జనసేన నేత కొణతాల రామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

అనకాపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించేందుకు సిద్ధమేనని మాజీ మంత్రి, జనసేన నేత కొణతాల రామకృష్ణ తెలిపారు. అనకాపల్లి గౌరీ గ్రంథాలయంలో మీడియా మిత్రుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ప్రధానంగా ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు సమస్యలపై పోరాడే పటిమ ఉందని, ఈ కారణంతోనే ఆయనతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నానన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని దత్తత తీసుకుని ఈ ప్రాంత సమస్యలపై పోరాడాలని పవన్‌ను కోరినట్టు చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏళ్ల తరబడి అనేక సమస్యలు పేరుకుపోయాయని, వాటిపై గతంలో ఉత్తరాంధ్ర చర్చా వేదిక పేరుతో పోరాటాలు సాగించామని, జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఇకముందు ఉత్తరాంధ్ర వెనుకబాటు, సాగునీటి జల వనరులపై ప్రభుత్వ నిర్లక్ష్యం వంటి సమస్యలపై పోరాటాలు సాగించనున్నట్టు చెప్పారు. త్వరలో అనకాపల్లిలో పవన్ కల్యాణ్‌తో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ ఆదేశిస్తే ఎంపీ, లేదా ఎమ్మెల్యే స్థానం నుంచి పోటీ చేసేందుకు సిద్ధమేనని, ఒక వేళ పార్టీ కోసం పని చేయాలని బాధ్యతలు అప్పగించినా దానికి సిద్ధంగా ఉన్నానన్నారు. విశాఖ రైల్వే జోన్‌కు స్థలం కేటాయించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటన్నారు. రైల్వే జోన్ ఏర్పాటుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే జోన్ ప్రకటించిన తరువాత అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమకూర్చుకోవచ్చని, జోన్ కార్యాలయాన్ని డీఆర్ఎం కార్యాలయంలో నడపవచ్చని సూచించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం ఉందన్నారు. సమావేశంలో కొణతాల పెదబాబు, బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆ వాల్‌పోస్టర్లు పోలీసుల సృష్టే!

» అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నాం
» ఏవోబీ ఎస్‌జెడ్‌సీ కార్యదర్శి గణేశ్ పేరిట మీడియాకు లేఖ విడుదల


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
ఆంధ్ర–ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ
మా పార్టీ సభ్యులపై వాట్సప్ గ్రూప్‌లో పోలీసులు ప్రచారం చేస్తున్న ఫేక్ న్యూస్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం!

మావోయిస్టు నేత గణేశ్ పేరిట విడుదల చేసిన లేఖ

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 7: తన పేరిట వాట్సాప్ గ్రూపుల్లో, ఏవోబీలోని పలు ప్రాంతాల్లో ప్రత్యక్షమైన వాల్‌పోస్టర్లతో మావోయిస్టు పార్టీకి ఎటువంటి సంబంధం లేదని, అంతా పోలీసుల సృష్టేనంటూ మావోయిస్టు పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ (ఎస్‌జెడ్‌సీ) కార్యదర్శి గణేశ్ పేరిట బుధవారం మీడియాకు ఒక ప్రకటన విడుదలైంది. ఇటీవల డుడుమ, ఒనకఢిల్లీ తదితర ప్రాంతాల్లో మావోయిస్టు నేత గణేశ్ పేరిట వాల్‌పోస్టర్లు ప్రత్యక్షమైన విషయం తెలిసిందే. దీంతో గణేశ్ పేరిట బుధవారం మీడియాకు లేఖ విడుదల అయ్యింది. "మా పార్టీ సభ్యులపై వాట్సాప్ గ్రూపుల్లో పోలీసులు ప్రచారం చేస్తున్న ఫేక్ న్యూస్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం. పార్టీ సభ్యులైన రమేశ్, రాజేశ్, స్వప్న, సంతు, తులసీలను మేము పార్టీ నుంచి బయటకు పంపించేశామని, ఏవోబీలోని రంగబయలు ప్రాంతంలో సంచరిస్తూ వారు కాంట్రాక్టర్ల నుంచి, ప్రజల నుంచి డబ్బులు, నిత్యావసర వస్తువులు సేకరిస్తున్నారని, వీరు గ్రామాలకు వస్తే ప్రజలు బంధించి మాకు అప్పజెప్పాలి" అని గణేశ్ పేరుతో ఒక ప్రకటన వాట్సాప్ గ్రూప్‌లలో ప్రచారం అవుతున్నది. అంతేకాకుండా వివిధ ప్రాంతాల్లో వాల్‌పోస్టర్లు కూడా వెలిశాయి. ఇది పూర్తిగా పోలీసులు సృష్టించినదేనని, ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదని, తన సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ప్రకటన ఇచ్చారని గణేశ్ పేర్కొన్నారు. పైన తెలియజేసిన సభ్యులను పార్టీ నుంచి తొలగించలేదని, తమ తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఏవోబీలో మావోయిస్టుల సమాచారం కోసం పోలీసులు ఇటువంటి నీచమైన ఎత్తుగడలకు పాల్పడి, ప్రజల్లో గందరగోళం సృష్టించి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఈ దుష్ప్రచారాన్ని నమ్మరని, వాస్తవాలను నిర్ధారించుకోకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని, వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయవద్దని గణేశ్ విజ్ఞప్తి చేశారు.

ఆశ కార్యకర్తల అరెస్టు అన్యాయం

» యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.సత్యవతి

రావికమతం, ఫిబ్రవరి 7: సమస్యలను ప్రభుత్వానికి చెప్పుకోవడానికి అమరావతి వెళుతున్న ఆశ కార్యకర్తలను మార్గ మధ్యంలో వాహనాల నుంచి పోలీసులు దించేసి అరెస్టు చేయడం అన్యాయమని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.సత్యవతి అన్నారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి విజయవాడకు బయలు దేరుతున్న ఆశ కార్యకర్తల్లో కొంతమందిని ఇళ్ల వద్ద, మరికొంత మందిని దారిలో అనకాపల్లి, నక్కపల్లి, ఎలమంచిలి ప్రాంతాల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆమె చెప్పారు. తమ సమస్యలను ప్రభుత్వానికి కాకపోతే మరెవరికి చెప్పుకోవాలని ఆమె ఆవేదనతో ప్రశ్నించారు. అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలు తమ ఆందోళనను ఆపలేవని, జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని ఆమె హెచ్చరించారు. కాగా రావికమతం మండలం కొమిర, కవ్వగుంట, చినపాచిల, గుమ్మాళ్లపాడు, కేబీపీ అగ్రహారం, తదితర గ్రామాల నుంచి విజయవాడ వెళుతున్న ఆశ కార్యకర్తలను రాత్రి పది గంటలకు నక్కపల్లి పోలీసులు వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద బస్సుల్లో నుంచి కిందకు దించి అక్కడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


రావికమతం మండలం నుంచి విజయవాడకు బస్సుల్లో వెళుతున్న ఆశ కార్యకర్తలను నక్కపల్లి మండలం వేంపాడు టోల్‌ప్లాజా వద్ద దించేసిన పోలీసులు

నేవీ ప్రహరీ గోడ నిర్మాణ పనులు అడ్డగింత


అధికారులతో మాట్లాడుతున్న సర్పంచ్ నారాయణరావు

రాంబిల్లి, ఫిబ్రవరి 7: మండలంలోని వైలోవ గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ వద్ద డీఆర్‌డీవో చేపట్టిన ప్రహరీ గోడ నిర్మాణ పనులను బుధవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. వైలోవ గ్రామంతో పాటు పెదకలవలాపల్లి గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండల చుట్టూ నేవీ ప్రహరీ గోడను నిర్మిస్తోంది. వైలోవ గ్రామ సమీపంలో ఉన్న గుడి వద్ద కొండపై నుంచి ఇళ్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రహరీ గోడ నిర్మిస్తామని చెప్పిన అధికారులు అందుకు విరుద్ధంగా గుడి ముందు నుంచి గ్రామానికి చేరువగా ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతుండడంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అప్పలస్వామి, సీఐలు దీనబంధు, లక్ష్మణరావులు వైలోవ గ్రామానికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. గోడ నిర్మాణంతో జరిగే నష్టాన్ని గ్రామ సర్పంచ్ బద్ది నారాయణరావు, మాజీ సర్పంచ్ బి.నారాయణరావు తదితరులు అధికారులకు వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని గ్రామస్థులకు సీఐ, తహసీల్దార్ హామీ ఇచ్చారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అప్పగింత

పాయకరావుపేట, ఫిబ్రవరి 7: మతిస్థిమితం లేని వ్యక్తిని పోలీసులు గుర్తించి అతని స్నేహితుడికి అప్పగించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పాయకరావుపేట దేవీనగర్‌లో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి తిరుగుతున్నట్టు పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులు అక్కడికి వచ్చి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఆ వ్యక్తి ఒడిశా రాష్ట్రం కోరాపుట్ గ్రామానికి చెందిన జుత్తుల అంథోనిగా గుర్తించారు. అనారోగ్యంతో చికిత్స నిమిత్తం విశాఖపట్నం వచ్చిన ఆంథోని మానసిక స్థితి బాగోలేక రైలులో పాయకరావుపేట వచ్చినట్టు అతడి స్నేహితుడైన తుని పట్టణానికి చెందిన కోనేటి రవికుమార్ తెలపడంతో ఆంథోనిని అతనికి అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

ఆశ కార్యకర్తలకు పోలీసుల నోటీసులు

» విజయవాడ ధర్నాకు వెళ్లకుండా అడ్డంకులు


ఆశ కార్యకర్తలకు నోటీసులు ఇచ్చిన అనకాపల్లి పట్టణ పోలీసులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7: విజయవాడలో గురువారం జరిగే ఆశ కార్యకర్తల ఆందోళనకు బయలుదేరుతున్న పట్టణంలోని పలువురు ఆశ కార్యకర్తలకు బుధవారం పట్టణ పోలీసులు నోటీసులు అందజేశారు. ఇలా నోటీసులను 20 మందికి పైగా ఆశ కార్యకర్తలకు పోలీసులు ఇచ్చినట్టు తెలిసింది. దీనిని సీఐటీయూ నాయకులు, ఆశ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు ఖండించారు. విజయవాడలో సమస్యలపై శాంతియుతంగా ధర్నా చేయడానికి వెళుతున్న కార్యకర్తలను జిల్లాలో ఎక్కడికక్కడ నిర్బంధించి రైలెక్కుతున్న వారిని దించేసి భయాందోళనకు గురిచేయడం దారుణమని సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఆశ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కె.శాంతి, వై.పార్వతి ఖండించారు. ఎన్టీఆర్ వైద్యాలయం, సబ్ సెంటర్ల వద్ద ఉన్న ఆశ కార్యకర్తలకు నోటీసులు ఇచ్చి విజయవాడ వెళితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించడం ప్రభుత్వానికి తగదన్నారు. పలువురు కార్యకర్తలను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించి తరువాత వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

అచ్యుతాపురంలో..


అచ్యుతాపురంలో ఆశ కార్యకర్తకి నోటీసు ఇస్తున్న పోలీసులు

అచ్యుతాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని గురువారం విజయవాడలో జరిగే ధర్నాకు వెళుతున్న ఆశ కార్యకర్తలకు పోలీసులు సెక్షన్ 149 నోటీసులు జారీ చేశారు. పోలీసులు బుధవారం ఆశ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చారు. దీనిని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు ఖండించారు.

బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌కు పది మంది దరఖాస్తు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 7: ఎలమంచిలి నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతూ పార్టీ అధిష్ఠానానికి పది మంది దరఖాస్తులు పంపారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు వీరంతా దరఖాస్తులు చేశారు. కాగా పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, పార్టీ రాష్ట్ర సైనిక్‌సెల్ కో కన్వీనర్ అగ్గాల హనుమంతరావు, అనకాపల్లి పార్లమెంట్ కన్వీనర్ బీటీఎస్ వర్మ పేర్లు అధిష్ఠానం పరిశీలనలో ఉన్నాయని తెలిసింది.

అప్పన్న తెప్పోత్సవం రేపే

» ఏర్పాట్లు పూర్తి.. సర్వాంగ సుందరంగా వరాహ పుష్కరిణి


నౌకను సిద్ధం చేస్తున్న సాంకేతిక సిబ్బంది

సింహాచలం, ఫిబ్రవరి 7 : వరాహలక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం కొండదిగువ స్వామివారి పుష్కరిణిలో శుక్రవారం జరగనుంది. ఈమేరకు ఈఓ శ్రీనివాస మూర్తి ఆదేశాల మేరకు కార్యనిర్వాహక ఇంజినీరు బండారు రాంబాబు సారథ్యంలో అధికారులు పుష్కరిణి పరిసరాలను తీర్చిదిద్దుతున్నారు. ప్రత్యేక పూజలు జరిగే మండపానికి, పుష్కరిణి మెట్లకు రంగులు అద్దారు. విద్యుద్దీపాలంకరణకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవంలో భాగంగా ఉదయం 7 నుంచి 8 గంటల వరకు దేవాలయ అర్చక బృందం సంప్రోక్షణ చేస్తారు. సాయంత్రం 4 నుంచి 4.30 గంటల స్వామివారు వేణుగోపాలుడి అలంకరణలో ఉభయ దేవేరులతో మెట్లమార్గంలో కొండదిగువ తొలిపావంచాకు చేరుకుంటారు. అక్కడి నుంచి పుష్కరిణి వద్దకు వెళ్లి ప్రత్యేక వేదికపై 5.30 గంటలకు భక్తులకు దర్శనమిస్తారు. అనంతరం హంసాకృతి నౌకపై పుష్కరిణిలో విహరిస్తారు. రాత్రి 7.15 వరకు పుష్కరిణి మధ్యలో ఉన్న మండపంలో పూజలు చేస్తారు. అక్కడి నుంచి పుష్కరిణి సత్రం ప్రాంగణానికి చేరుకుని 8.15 గంటలకు సర్వజన మనోరంజని వాహనంపై మాడవీధుల్లో తిరువీధి జరుపుతారు. తిరిగి మెట్ల మార్గంలో స్వామివారు సింహగిరికి చేరుకోవడంతో ఉత్సవం ముగుస్తుంది.

అంతర్ జిల్లా హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక


అంతర్ జిల్లా హాకీ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

ఎలమంచిలి, ఫిబ్రవరి 7: కర్నూలు జిల్లాలో ఈ నెల 10వ తేదీ నుంచి జరగనున్న 14వ అంతర్ జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ టోర్నమెంట్‌కు అనకాపల్లి జిల్లా జట్టును బుధవారం స్థానిక రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో ఎంపిక చేసినట్టు జిల్లా హాకీ అడహాక్ కమిటీ వైస్ చైర్మన్ కొరారు నరేశ్ తెలిపారు. ఎంపికైన వారిలో పి.జగదీశ్(కెప్టెన్), బి.సమిధర్, కె.సూర్య, టి.శ్రీధర్, కె.పవన్‌కుమార్, కె.గణేశ్, ఎల్.చైతన్య, రామ్‌చరణ్, జి.స్వరూప్, భరత్, శివసూర్య మణికంఠ, చరణ్ శ్రీవర్ధన్, కె.మనోజ్, కె.దుర్గా వెంకటసాయి, డి.రోహిత్, ఏపీ వెంకట్ ఉన్నారని తెలిపారు.

రిమాండ్ ఖైదీ మృతి

» గుండెపోటుతో చనిపోయినట్టు సూపరింటెండెంట్ ప్రకటన
» జైలు అధికారులు కొట్టడం వల్లే చనిపోయినట్టు మృతుడి బంధువుల ఆరోపణ

విశాఖపట్నం , ఫిబ్రవరి 7: విశాఖపట్నం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గుడే పోతన్న (45) మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్టు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం...అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం బద్దంబూరు గ్రామానికి చెందిన పోతన్న గత ఏడాది జూలైలో గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడికి పాడేరు కోర్టు రిమాండ్ విధించడంతో పోలీసులు సెంట్రల్ జైలుకు తరలించారు. జైలుకు వచ్చిన సమయంలోనే అనారోగ్యంగా ఉన్నాడు. మంగళవారం ఉదయం అస్వస్థతకు గురవ్వడంతో జైలు వైద్యులు పరీక్షలు జరిపి, అతనికి గుండె సంబంధిత సమస్య ఉన్నట్టు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతుండగా గుండెపోటు రావడంతో మృతిచెందినట్టు సూపరింటెండెంట్ తెలిపారు. కాగా జైలు అధికారులు కొట్టడం వల్లే పోతన్న చనిపోయినట్టు అతని కుటుంబీకులు, బంధువులు ఆరోపిస్తున్నారు.

అనకాపల్లి
నియోజకవర్గం

వార్డుల్లో జోనల్ కమిషనర్ పర్యటన


దేమునిగుమ్మం వద్ద పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న జెడ్సీ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7 : జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు పట్టణంలోని పలుచోట్ల బుధవారం పర్యటించారు. దేమునిగుమ్మం వద్ద పారిశుధ్య పనులను పర్యవేక్షించి, పలు సూచనలు చేశారు. అలాగే వేల్పుల వీధిలోని ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

జడ్సీ దృష్టికి 84వ వార్డు సమస్యలు

జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును 84వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు కలిశారు. ఈ సందర్భంగా వార్డులో సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి సహకరించాల్సిందిగా కోరారు.

అభివృద్ధి పనుల నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తూరు, ఫిబ్రవరి 7 : సత్యనారాయణపురం పంచాయతీ మూలపేటలో పలు అభివృద్ధి పనుల నిర్మాణానికి ఎంపీపీ గొర్లి సూరిబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పలక భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ అలివేణి మల్లేశ్వరరావు, గ్రామ నాయకుడు పలక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

టైలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడికి సత్కారం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7 : న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన గవరపాలేనికి చెందిన మహేశ్‌ను వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఆలయంలో టైలర్లు ముత్తా ఈశ్వరరావు, కోనేటి భద్రం తదితరులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, కాశీ బ్రహ్మాజీ, కొరుప్రోలు గౌరీష్, దుర్గ పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా, ఆయుర్వేదంపై శిక్షణ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7 : ఇక్కడి జార్జిక్లబ్‌లో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు యోగా, ఆయుర్వేదంపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు పతంజలి యోగా సమితి, భారత స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు బీశెట్టి దొరనాయుడు తెలిపారు. ఈ తరగతులకు పతాంజలి యోగా అధ్యక్షురాలు, యోగా నిపుణులు ప్రభా సాహో ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్టు చెప్పారు. పట్టణవాసులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

ఈఆర్‌వోకు మాత్రమే ఓట్ల తొలగింపు అధికారం

▸▸ ఓటర్ల నమోదుపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా షోకాజ్‌లు ▸▸ రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : ఇకపై ఓట్ల తొలగింపు అధికారం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌వో)కు మాత్రమే ఉంటుందని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. ఇక్కడి శంకరంలోని కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల నమోదుపై వివిధ పత్రికలలో వచ్చిన ప్రతికూల వార్తలను అనుసరించి వీఆర్వోలు, సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేసినట్టు చెప్పారు. జిల్లాలోని 594 ప్రాంతాలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ల ప్రదర్శన, వాటి ద్వారా ఓటువేసే విధానంపై అవగాహన కల్పించామన్నారు. ఇప్పటి వరకు 26,783 మంది ఓటర్లు ఈవీఎంల పరిశీలన, ఓటింగ్ విధానం నేర్చుకున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ బి.దయానిధి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ డి.రామ్మూర్తి, డీటీ రవికుమార్, ఎస్‌ఏ తుల సీరామ్‌తో పాటు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ఆకట్టుకున్న అన్నమయ్య కీర్తనల ఆలాపన పోటీలు


బహుమతులు అందుకున్న విద్యార్థులు, నిర్వాహకులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 7 : భారత్ వికాస్ పరిషత్ సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఇక్కడి గౌరీపంచాయతన ఆలయంలో బుధవారం విద్యార్థినీ విద్యార్థులకు అన్నమయ్య కీర్తనల ఆలాపన పోటీలు నిర్వహించారు. పరిషత్ అధ్యక్షుడు ఆళ్ల ఓంరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఎంవీ హర్షిణి, ఎం.భాష్య, ఐ. భావనారుషికుమార్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించగా, ఎస్.యశ్వశిని ప్రత్యేక బహుమతిని సొంతం చేసుకుంది. వీరికి గౌరీసేవా సంఘం కార్యదర్శి బొడ్డేడ రాము బహుమతులను అందజేశారు. పరిషత్ ప్రతినిధులు ఎన్‌ఏటీ వర్మ, డి.శివరామ్, ఎస్.గోపాలరావు, బుద్ధ అప్పారావు, డాక్టర్ ఎస్.నూకరాజు, వై.కేశవరావు, చదరం కోటేశ్వరరావు, సానా త్రినాథరావు పాల్గొన్నారు.

వితంతు పింఛన్ మంజూరుకు పాట్లు

... 5వ పేజీ తరువాయి

డీఆర్‌డీఏ అధికారులకు బదిలీ చేయగా వారు పరిశీలించారు. భర్త అప్పలనాయుడు పేరును పింఛన్ జాబితా నుంచి సచివాలయం లాగిన్‌లో మాత్రమే తొలగించారని, గ్రామ వలంటీరు లాగిన్‌లో కూడా తొలగించాలని, అప్పుడే పింఛన్ మంజూరు అవుతుందని డీఆర్‌డీఏ అధికారులు చెప్పారు. దీంతో ఆమె నాతవరం తిరిగి వచ్చి సచివాలయం సిబ్బందిని, గ్రామ వలంటీరును కలిసింది. అప్పలనాయుడు పేరును గతంలోనే తాము తొలగించామని, డీఆర్‌డీఏ కార్యాలయంలోనే తొలగించాల్సి వుందని వారు చెప్పారు. దీంతో ఎవరు నిజం చెబుతున్నారో, ఎవరు అబద్ధం చెబుతున్నారో తెలియక వృద్ధురాలు తీవ్ర మనోవేదన చెందుతున్నది. గ్రామ వలంటీరు నుంచి జిల్లా కలెక్టర్ వరకు కలిశానని, ఏ ఒక్కరూ తనకు న్యాయం చేయడంలేదని సన్యాసమ్మ వాపోయింది. ఇదిలావుండగా సన్యాసమ్మ కుటుంబ సభ్యులు, బంధువులు తెలుగుదేశం పార్టీ మద్దతు దారులు కావడం వల్లనే ఆమెకు వితంతు పింఛన్ మంజూరు చేయడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

'టీడీపీ కార్యకర్త కుటుంబానికి ప్రతి నెలా ఆర్థిక సాయం'

కొత్తూరు, ఫిబ్రవరి 7 : సుందరయ్యపేటకు చెందిన టీడీపీ కార్యకర్త బాదపు శ్రీను ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పార్టీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతుని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం డీవీఆర్ చారిటబుల్ ట్రస్టు తరపున నెలకు రూ.4వేలు ఆర్థిక సాయంగా అతని భార్య బాదపు లక్ష్మికి అందిస్తామని ప్రకటించారు. నాయకుడు బాదపు తాతారావు, ఉప సర్పంచ్ బాదపు హరికృష్ణ, సరిపల్లి వెంకటేష్, బాదపు అప్పారావు, బొట్టా రామకృష్ణ, మొల్లి శ్రీను, నాయుడు, బొడ్డపాటి చిన రాజారావు, దాడి గణేష్, శివనాయుడు, త్రినాథ్, శ్రీను, కుమార్ పాల్గొన్నారు.

భరోసా ఇవ్వని బడ్జెట్!

... 5వ పేజీ తరువాయి

చెప్పుకున్నప్పటికీ.. అనకాపల్లి జిల్లాకు సంబంధించి ప్రత్యేక కేటాయింపులు అంటూ ఏమీ లేవు. సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణకు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి, అసంపూర్తిగా వున్న ప్రాజెక్టుల పనులను పూర్తిచేయడానికి, చిన్నతరహా నీటి వనరుల మరమ్మతులకు నిధులకు కేటాయించలేదు. వైసీపీ ప్రభుత్వం గత నాలుగేళ్లలో సాగు నీటి రంగానికి కనీసస్థాయిలో కూడా నిధులు ఇవ్వలేదని, చివరి సంవత్సరం..అందునా రెండు నెలల్లో ఎన్నికలు రానుండడంతో సాగునీటి వనరులకు ఈసారైనా నిధుల కేటాయిస్తుందన్న అన్నదాతల ఆశలు మరోసారి ఆవిరయ్యాయి. రైవాడ, కోనాం, పెద్దేరు, కల్యాణపులోవ ప్రాజెక్టుల సాగునీటి కాలువల్లో పూడిక తీత, సిమెంట్ లైనింగ్, ఇతర కట్టడాల మరమ్మతులకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఏళ్ల తరబడి అసంపూర్తిగా వున్న తారకరామ, పాలగెడ్డ, గొర్రిగెడ్డ, ఉకగెడ్డ వంటి చిన్నతరహా ప్రాజెక్టులకు కాసులు విదల్చలేదు. ఇక శారదా నదిపై వున్న గ్రోయిన్ల ఆధునికీ కరణ, మరమ్మతులు, కాలువల్లో పూడికతీత పనులను వైసీపీ పాలకులు ఎప్పుడో గాలికొదిలేశారు. మొత్తం మీద ఈ సాగునీటి ప్రాజెక్టులన్నీ ఇద్దరు మంత్రులు, ప్రభుత్వ విప్ ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో వున్నాయని, వీటికి నిధుల కేటాయింపుకు వారిస్థాయిలో కృషి చేయలేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు.

పెందుర్తి
నియోజకవర్గం

'పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు'


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌వో శేషశైలజ

సబ్బవరం, ఫిబ్రవరి 7 : సార్వత్రిక ఎన్నికలు నియోజకవర్గంలో పక్కాగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పెందుర్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి శేషశైలజ తెలిపారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద నేమ్ బోర్డులు, వాష్ రూమ్స్, విద్యుత్తు, తాగునీరు, ర్యాంపులు ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. తహసీల్దార్ జె.చలమయ్య, డీటీ వెంకట్, వీఆర్వో శేషు తదితరులు ఆమె వెంట ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరాంజనేయస్వామి తీర్థం

సబ్బవరం, ఫిబ్రవరి 7 : ఆరిపాక శివారు చినయాతపాలెంలో వీరాంజనేయస్వామి తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. మాజీ ఎంపీటీసీ మల్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా వేకువజాము నుంచి స్వామి వారికి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా చింతకాయల ముత్యాలు జన్మదిన వేడుకలు

పరవాడ, ఫిబ్రవరి 7 : పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు జన్మదిన వేడుకలను స్వగ్రామం ముత్యాలమ్మపాలెంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అభిమానుల సమక్షంలో ఆయన కేక్ కట్‌చేశారు. స్థానిక సర్పంచ్ చింతకాయల సుజాత, తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, మండల కో-ఆప్షన్ సభ్యుడు షైలపల్లి అప్పన్న, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చింతకాయల అమ్మోరు, స్థానిక నాయకులు సూరాడ ముత్యాలరావు, సూరాడ పెంటయ్య, అప్పలరాజు, సోమేశ్వరరావు, ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధి గ్రామాల ప్రజలు, పెద్దలు, పలువురు


ముత్యాలుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్న ముత్యాలు

మత్స్యకార నాయకులు శుభాకాంక్షలు తెలియజేసి జ్ఞాపికలను అందజేశారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకుని 300 మంది వృద్ధులకు దుప్పట్లు, 450 మంది మహిళలకు చీరలు, వంద మంది దివ్యాంగులకు పదేసి కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. అలాగే మహిళా పారిశుధ్య కార్మికులకు బియ్యం పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేశారు. అనంతరం వెయ్యి మందికిపైగా ప్రజలకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతకాయల యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి
నియోజకవర్గం

ఓటరు జాబితాలో అవకతవకలపై చర్యలు తీసుకోండి

డిప్యూటీ తహసీల్దార్‌కు టీడీపీ నేతల ఫిర్యాదు

రాంబిల్లి, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలో ఓటరు జాబితాల్లోని అవకతవకలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు ప్రస్తుతం జారీ చేసిన జాబితాలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు, మరణించిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించకపోవడం, వివాహాలు జరిగి వేరే ఊరు వెళ్లిపోయిన వారి పేర్లు కూడా ఉండడంతో పరిశీలన చేయాలని ఈ సందర్భంగా పార్టీ నేతలు కోరారు. ఈ విషయంలో అధికారులు చర్యలు చేపట్టకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టిబాబు, చెల్లూరి ఆనంద్, జి.గోవింద్, రంగాల నూకరాజు, అప్పలరాజు, వెంకటరావు తదితరులు ఉన్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి తీర్థమహోత్సవం

▸▸ అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రాంబిల్లి, ఫిబ్రవరి 7: మండలంలోని అప్పారాయుడుపాలెం గ్రామంలో అభయాంజనేయస్వామి తీర్థమహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారిని స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. గ్రామ పెద్దలు ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి నిర్వహించిన ప్రత్యేక భజనలు, చితడలతో పాటు సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. జనసేన నాయకులు సుందరపు విజయకుమార్, బి.రామదాసు, నూకన్నదొర, ఎస్.లోవరాజుతో పాటు స్థానిక నేతలు ఎ.రామారావు, ఎన్.నాగేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, చిరంజీవి పాల్గొన్నారు.

అచ్యుతాపురం రోడ్డు పునర్నిర్మాణానికి పోరుబాట

రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాల తీర్మానం

మునగపాక, ఫిబ్రవరి 7: అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు పునర్నిర్మాణంపై ప్రజా పోరుబాట నిర్వహించాలని అఖిలపక్షాల నాయకులు, ప్రజా సంఘాలు ప్రతినిధులు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం మునగపాక కోపరేటివ్ భవనం హాలులో రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ అధ్యక్షుడు కాండ్రేగుల సదాశివరావు అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశానికి అచ్యుతాపురం, మునగపాక మండలాల ప్రజా ప్రతినిధులు, వైసీపీ, టీడీపీ, జనసేన, సీపీఎం నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు హాజరయ్యారు. ఈ సమస్యపై రాజకీయాలకు అతీతంగా గురువారం నుంచి పోరాడాలని, ప్రజాందోళన కార్యక్రమాలు రోజురోజుకూ తీవ్రతరం చేయాలని వారంతా నిర్ణయించారు. అనంతరం 25 మందితో ఒక పోరాట కమిటీని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి కార్యాచరణను కూడా రూపొందించారు. ఈ నెల 8 నుంచి 11 వరకూ గ్రామాలలో తిరిగి సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజలకు సమస్య తీవ్రతను వివరించి ఉద్యమంలో భాగస్వాములను చేయడం, తర్వాత నిరవధికంగా రోడ్డు నిర్బంధం చేయాలని, అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకూ భారీ మానవహారం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తూ బైపాస్ జంక్షన్‌లో గడ్డర్‌ను ఏర్పాటు చేయాలని, అప్పటికీ అధికారులలో చలనం కనిపించకపోతే ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి అచ్చయ్యనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, గంటా శ్రీరామ్, బ్రహ్మాజీ, రైతు సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్, నాయకులు ఎం.సత్యనారాయణ, యల్లపు వెంకటభాస్కర్ పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

'ఉద్యోగుల ఆశలు వమ్ముచేసిన జగన్'

అచ్యుతాపురం, ఫిబ్రవరి 7: ఉద్యోగుల ఆశలను జగన్‌రెడ్డి ప్రభుత్వం వమ్ము చేసిందని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మద్దిల నానాజీ, కె.సుభాషిణి అన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద బుధవారం ఓట్ ఫర్ ఓపీఎస్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎనిమిదేళ్లగా సీపీఎస్ రద్దు కోసం పోరాటాలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13.2 లక్షల మంది ఉద్యోగులు నిరంతరం పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన సీపీఎస్ రద్దు హామీని ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. ఓపీఎస్ ఇచ్చేవరకు పోరాటం సాగిస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు వి.శ్రీలక్ష్మి, ఎం.సూర్యలక్ష్మి, మురళీకృష్ణ, పారిజాతం, కమల పాల్గొన్నారు.

మహిళ ఫిర్యాదుతో వ్యక్తిపై కేసు నమోదు

ఎలమంచిలి, ఫిబ్రవరి 7: మండలంలోని ఏటికొప్పాక గ్రామంలో వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన పి.చిరంజీవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ సింహాచలం తెలిపారు. చిరంజీవి మంగళవారం రాత్రి వివాహిత ఇంటి తలుపులు కొట్టాడని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

వేంపాడులో ప్రత్యేక వైద్య శిబిరం


బీపీ పరీక్షలు చేయించుకుంటున్న సీఐ విజయ్‌కుమార్

నక్కపల్లి, ఫిబ్రవరి 7: మండలంలోని వేంపాడు హైవే టోల్ ప్లాజా వద్ద రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నక్కపల్లి, అడ్డరోడ్డు సీఐలు విజయ్ కుమార్, అప్పన్న, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వీసం రామకృష్ణ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు వాహన చోదకులకు బీపీ, షుగర్‌తో పాటు అనేక పరీక్షలు చేయించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ సౌమ్య నేతృత్వంలో ఈ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టోల్‌ప్లాజా సేఫ్టీ మేనేజర్ అశోక్ రాహుల్, మేనేజర్ కృష్ణ, ఐఎంటీ మేనేజర్ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రగ్బీ క్రీడాకారులకు ధ్రువపత్రాలు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 7: రగ్బీలో ఐదో స్థానం సాధించిన అనకాపల్లి జిల్లా జట్టుకు వైసీపీ నాయకుడు కూండ్రపు వెంకునాయుడు బుధవారం ధ్రువపత్రాలను అందించారు. ఈ నెల మూడు, నాలుగు తేదీల్లో భీమిలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అనకాపల్లి జిల్లా జట్టు ఐదో స్థానం సాధించింది. జిల్లా జట్టు ఎంపిక అచ్యుతాపురంలోనే జరిగింది. అలాగే జట్టు కోచ్ కూండ్రపు నాగవెంకటరావు ఈనెల 13, 14ల్లో గుజరాత్ గాంధీనగర్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఏపీ రాష్ట్ర రగ్బీ యూ-14 జట్టుకు కోచ్‌గా ఎంపికైనందుకు అతన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగదీష్, విజయ్, శివ, అప్పలరాజు, కె.రమేష్, ఎల్.దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి వేడుకలు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 7: మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రమాబాయి అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీ రమణారావు ఉపాధ్యాయులతో కలిసి రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్‌కు అభినందనల వెల్లువ


సతీష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న లాలం చందు, నాయకులు

రాంబిల్లి/అచ్యుతాపురం, ఫిబ్రవరి 7: జనసేన పార్టీ ఉత్తరాంధ్ర ప్రతినిధిగా నియమితులైన సుందరపు సతీష్‌కుమార్‌ను బుధవారం ఎలమంచిలి నియోజకవర్గ యువనేత,ఎ౦గా బ్లడ్ బ్రదర్ లాలం చందు పార్టీ నాయకులతో మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖలోని ఆయన నివాసంలో బుధవారం కలిసి సతీష్‌కుమార్‌ను సత్కరించారు. అలాగే పార్టీ శ్రేణులతో కలిసి అభినందనలు తెలిపారు. అలాగే రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల నుంచి జనసేన నాయకులు తరలివచ్చి సతీష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకలుఉ రుత్తల శ్రీను, రుత్తల నరేష్, లాలం నాని, కొండబాబు, శివాజీ, బి.రాంబాబు, కె.శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహా మాయ

... 5వ పేజీ తరువాయి

ఖర్చు అయిందంటూ ప్రజారోగ్య విభాగం అధికారులు బిల్లు తయారుచేశారు. ఆ మొత్తాన్ని కాంట్రాక్టర్లకు చెల్లించాలంటూ పలు కేటగిరీల కింద ప్రతిపాదనలు తయారుచేసి స్టాండింగ్ కమిటీ ఆమోదానికి పెట్టగా సభ్యులు ఒక్కరు కూడా అభ్యంతరం వ్యక్తంచేయకుండా ఆమోదించేసింది. మద్దిలపాలెం జంక్షన్ నుంచి ఆశీల్‌మెట్ట జంక్షన్ వరకూ బీఆర్‌టీఎస్ రోడ్డుపై బీటీ హాట్‌మిక్స్ వేసేందుకు సుమారు రూ.రెండు కోట్లను ఖర్చు చేసేందుకు కమిటీ ఆమోదించింది. అలాగే బీచ్‌రోడ్డులోని మారిటైమ్ మ్యూజియం మరమ్మతులకు రూ.50 లక్షలు, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి వివిధ వార్డుల్లో రూ.21.63 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

పాయకరావుపేట
నియోజకవర్గం

తీరంలో ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం

నక్కపల్లి, ఫిబ్రవరి 7: సముద్ర తీరంలో ప్లాస్టిక్ నిషేధానికి అందరూ నడుం బిగించాలని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు పిలుపునిచ్చారు. మండలంలోని రాజయ్యపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేటకు వెళ్లే మత్స్యకారులు కూడా ప్లాస్టిక్ కవర్లు వాడకుండా అవగాహన పెంపొందించాలన్నారు. కాలుష్యం కాటుకు గురైన మత్స్యసంపదను తినడం వల్ల అనేక రోగాలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. కాగా సంఘం రాజయ్యపేట అధ్యక్షుడిగా ఎం.ప్రసాద్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొవిరి వెంకటేశ్, నాయకులు పిక్కి కోదండరావు, వాసుపల్లి శివ, ఎరుపిల్లి అప్పలరాజు, సిరిపిల్లి అప్పలరాజు, పిక్కి గంగరాజు, ధోని గోపీ, ఆదిరాజు, కోటి పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

పాయకరావుపేట, ఫిబ్రవరి 7: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కె.స్వప్న కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 9న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న మొత్తం 13,589 మంది పిల్లలకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సుభాష్, డాక్టర్ వీఎస్.సౌందర్య, ఎంపీఈవో రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.,

నులి పురుగుల నిర్మూలన పోస్టర్ ఆవిష్కరణ

ఎస్.రాయవరం: మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన పోస్టర్‌ను ఎంపీడీవో కె.సత్యనారాయణ, ఎంఈవో మూర్తి బుధవారం ఆవిష్కరించారు. పెనుగొల్లు, సర్వసిద్ధి పీహెచ్‌సీల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, సహాయకులు, ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు అల్బెండ జోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు ఈ సందర్భంగా సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ఎస్‌వీ శక్తిప్రియ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారులు టి.సత్యనారాయణ, కె.శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ ఆదినారాయణ, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లస్టర్ పర్యవేక్షకులు పీఎన్‌వీఎస్ ప్రసాద్, షేక్ అమీర్ షాజిద్ తదితరులు పాల్గొన్నారు.

దళితవాడ పంచాయతీ సాధన సంకల్ప సభకు తరలిరండి

పాయకరావుపేట, ఫిబ్రవరి 7: పాయకరావుపేటలో ఈ నెల 10న జరుగనున్న దళితవాడ పంచాయతీ సాధన సంకల్ప సభకు తరలిరావాలని దళిత నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, సీఐ విజయ్‌కుమార్ తదితరులు దళితవాడ పంచాయతీ సాధన సంకల్ప సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ హైస్కూల్ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న సభకు అధిక సంఖ్యలో దళితులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పల్లా విలియంకేరి, ఇంజరపు సూరిబాబు, నరసింహమూర్తి, కశింకోట సత్తిబాబు, బోడపాటి శ్రీను, ముక్కుడుపల్లి నాగరాజు పాల్గొన్నారు

పల్లెల దుస్థితి ఎవరికి ఎరుక..!!

పంచాయతీల్లో నిధుల లేమి గ్రామాల అభివృద్ధికి గ్రహణంగా మారింది. వీధి రోడ్లు, తదితరాల నిర్మాణాల మాట అటుంచితే... కనీసం పారిశుధ్య పనులకు కూడా చిల్లిగవ్వ లేని దుస్థితి దాపురించింది. ఫలితంగా ఏ పల్లెలో చూసినా మురుగు తిష్ఠవేస్తూ పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

▸▸ ఎక్కడికక్కడ మురుగు తిష్ఠ ▸▸ పట్టించుకోని పాలకులు ▸▸ దుర్వాసన.. దోమల బెడదతో జనం అవస్థలు



బుచ్చెయ్యపేట మండలం కొండపాలెంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 7 : మండలంలోని కొండపాలెంలో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. గ్రామంలోని రామాలయంతో పాటు మంత్రి చినబాబు, ఉగ్గిన అప్పారావు ఇంటి నుంచి ఎస్సీ కాలనీ వరకు గల సీసీ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ సదుపాయం లేదు. దీంతో రోడ్డుకు ఇరుపక్కలా నివాసం ఉంటున్న ఇళ్లవారి వాడుకనీరు రోడ్డుపైకి చేరి నిలిచిపోతోంది. ఫలితంగా రోడ్డంతా బురదమయంగా మారి రాకపోకలకు అంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓవైపు దోమల బెడద, మరో వైపు దుర్వాసన భరించలేకపోతున్నామని పరిసరాల వారు వాపోతున్నారు. అంటువ్యాధుల భయం వెంటాడుతోందని ఆందోళన చెందుతున్నారు. రోడ్డుకు ఇరుపక్కలా కాలువలు నిర్మించాలని ఏళ్ల తరబడి వేడుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారని అక్కడి వారు చెపుతున్నారు. రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో నడకకు కూడా అవకాశం లేకుండా పోయిందని అంటున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో సీసీ రోడ్లకు ఇరుపక్కలా కాలువలు నిర్మించి, మురుగు సమస్యకు పరిష్కారం చూపాల్సిందిగా వారంతా కోరుతున్నారు.



గొలుగొండ మండలం ఏటిగైరంపేటలో దుస్థితి

ఏటిగైరంపేటలో...

గొలుగొండ : ఏటిగైరంపేటను మురుగు సమస్య వీడడం లేదు. వీధుల్లోని కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. గ్రామంలోని రామాలయం వీధిలో సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన కాలువలు మురుగుతో దర్శనమిస్తున్నాయి.

ఎం.కెవల్లాపురం వెళ్లే రూట్లో...

మాడుగుల రూరల్ : ఏజెన్సీ ముఖ ద్వారంగా ఉన్న ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి ఎం.కెవల్లాపురం వెళ్లే రహదారిపక్కన గల దుకాణదారులు ముగురు సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో రోడ్డుకి ఓ వైపు మాత్రమే పూర్తిస్థాయిలో డ్రైనేజీ ఉంది. ఇదే రోడ్డుకి మరో వైపు డ్రైనేజీ పూర్తిగా చివర వరకు తవ్వక పోవడంతో పైనుంచి దిగువకు వస్తున్న మురుగు నీరు నిలిచిపోతోంది. దీంతో తీవ్రమైన దుర్గంధంతో పాటు దోమల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వ్యాపారులు చెపుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఎం.కె.వల్లాపురం పంచాయతీ పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకునేవారు కరువయ్యారని పలువురు వాపోతున్నారు. కనీసం వ్యర్థాలు తొలగించే పనులు చేపట్టలేదని దుకాణదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాల్సిందిగా అక్కడి వారంతా కోరుతున్నారు.



మాడుగుల రూరల్: ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి ఎంకేవల్లాపురం వెళ్లే రోడ్డులో...

దీంతో ఓవైపు దోమల బెడద, మరో వైపు దుర్వాసనతో నిత్యం నరకాన్ని చూస్తున్నామని అంతా వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మురుగు సమస్యకు పరిష్కారం చూపాల్సిందిగా కోరుతున్నారు.

పల్లె పల్లెన అడుగిడుతాం.. నియోజకవర్గ సమస్యలు తెలుసుకుంటాం

▸▸ టీడీపీ, జనసేన నాయకులు బత్తుల తాతయ్యబాబు, పీవీఎస్ఎన్ రాజు



రోలుగుంటలో పాదయాత్ర చేస్తున్న తాతయ్యబాబు, పీవీఎస్ఎన్‌రాజు తదితరులు

రోలుగుంట, ఫిబ్రవరి 7 : వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో చోడవరం నియోజకవర్గం అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఆరోపించారు. నియోజకవర్గంలో సమస్యలు తెలుసుకునేందుకు చేపట్టిన పాదయాత్రకు బుధవారం రోలుగుంటలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 45 కిలోమీటర్లు పాదయాత్ర చేసి సమస్యలన్నింటినీ తెలుసుకుంటామన్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి మరీ దారుణంగా ఉందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎమ్మెల్యేకు పట్టకపోవడం దారుణమన్నారు. వైసీపీ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగి చెంది ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకుని తద్వారా నియోజకవర్గ అభివృద్ధికి అంతా కృషి చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, స్థానిక నాయకులు సుర్ల రామకృష్ణ, బోడాపాత్రుని నరేష్, కోలిపల్లి ఈశ్వరరావు, పరిసం లోవరాజు, రొంగలి రమణ, సుర్ల బాబులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఓటర్ల జాబితాల్లో తప్పులను సరిచేయండి'



తహసీల్దార్‌కు సమస్యలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 7: మండలంలో కొత్తగా ప్రకటించిన ఓటర్ల జాబితాల్లో తప్పులను సరిచేయాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఎం.మురళీ మహన్‌రావును బుధవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బీఎల్‌వోల పని తీరు సక్రమంగా లేదని ఆరోపించారు. ఓటర్ల జాబితాల్లో తప్పులకు వారే కారణంగా పేర్కొన్నారు. మండలంలో ఉన్న 59 పోలింగ్ బూతుల్లో ఓటర్ల జాబితాలను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు, జోగిపాత్రుడు, గోవింద, కోసూరు శ్రీను ,కేతిరెడ్డి చిరంజీవి, లాలం రాము తదితరులు పాల్గొన్నారు.

మహా మాయ

... 5వ పేజీ తరువాయి

ఖర్చు అయిందంటూ ప్రజారోగ్య విభాగం అధికారులు బిల్లు తయారుచేశారు. ఆ మొత్తాన్ని కాంట్రాక్టర్లకు చెల్లించాలంటూ పలు కేటగిరీల కింద ప్రతిపాదనలు తయారుచేసి స్టాండింగ్ కమిటీ ఆమోదానికి పెట్టగా సభ్యులు ఒక్కరు కూడా అభ్యంతరం వ్యక్తంచేయకుండా ఆమోదించేసింది. అలాగే మద్దిలపాలెం జంక్షన్ నుంచి ఆశీల్‌మెట్ట జంక్షన్ వరకూ బీఆర్‌టీఎస్ రోడ్డుపై బీటీ హాట్‌మిక్స్ వేసేందుకు సుమారు రూ.రెండు కోట్లను ఖర్చు చేసేందుకు కమిటీ ఆమోదించింది. అలాగే బీచ్‌రోడ్డులోని మారిటైమ్ మ్యూజియం మరమ్మతులకు రూ.50 లక్షలు, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి వివిధ వార్డుల్లో రూ.21.63 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

వితంతు పింఛన్ మంజూరుకు పాట్లు

... 5వ పేజీ తరువాయి

డీఆర్‌డీఏ అధికారులకు బదిలీ చేయగా వారు పరిశీలించారు. భర్త అప్పలనాయుడు పేరును పింఛన్ జాబితా నుంచి సచివాలయం లాగిన్‌లో మాత్రమే తొలగించారని, గ్రామవలంటీరు లాగిన్‌లో కూడా తొలగించాలని, అప్పుడే పింఛన్ మంజూరు అవుతుందని డీఆర్‌డీఏ అధికారులు చెప్పారు. దీంతో ఆమె నాతవరం తిరిగి వచ్చి సచివాలయం సిబ్బందిని, గ్రామ వలంటీరును కలిసింది. అప్పలనాయుడు పేరును గతంలోనే తాము తొలగించామని, డీఆర్‌డీఏ కార్యాయలంలోనే తొలగించాల్సి వుందని వారు చెప్పారు. దీంతో ఎవరు నిజం చెబుతున్నారో, ఎవరు అబద్ధం చెబుతున్నారో తెలియక వృద్ధురాలు తీవ్రమనోవేదన చెందుతున్నది. గ్రామ వలంటీరు నుంచి జిల్లా కలెక్టర్ వరకు కలిశానని, ఏ ఒక్కరూ తనకు న్యాయం చేయడంలేదని సన్యాసమ్మ వాపోయింది. ఇదిలావుండగా సన్యాసమ్మ కుటుంబ సభ్యులు, బంధువులు టీడీపీ మద్దతుదారులు కావడం వల్లనే ఆమెకు వితంతు పింఛన్ మంజూరు చేయడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

భరోసా ఇవ్వని బడ్జెట్!

... 5వ పేజీ తరువాయి

చెప్పుకున్నప్పటికీ.. అనకాపల్లి జిల్లాకు సంబంధించి ప్రత్యేక కేటాయింపులు అంటూ ఏమీ లేవు. సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణకు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి, అసంపూర్తిగా వున్న ప్రాజెక్టుల పనులను పూర్తిచేయడానికి, చిన్నతరహా నీటి వనరుల మరమ్మతులకు నిధులకు కేటాయించలేదు. వైసీపీ ప్రభుత్వం గత నాలుగేళ్లలో సాగు నీటి రంగానికి కనీసస్థాయిలో కూడా నిధులు ఇవ్వలేదని, చివరి సంవత్సరం..అందునా రెండు నెలల్లో ఎన్నికలు రానుండడంతో సాగునీటి వనరులకు ఈసారైనా నిధుల కేటాయిస్తుందన్న అన్నదాతల ఆశలు మరోసారి ఆవిరయ్యాయి. రైవాడ, కోనాం, పెద్దేరు, కల్యాణపులోవ ప్రాజెక్టుల సాగునీటి కాలువల్లో పూడిక తీత, సిమెంట్ లైనింగ్, ఇతర కట్టడాల మరమ్మతులకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఏళ్ల తరబడి అసంపూర్తిగా వున్న తారకరామ, పాలగెడ్డ, గొర్రిగెడ్డ, ఉకగెడ్డ వంటి చిన్నతరహా ప్రాజెక్టులకు కాసులు విదల్చలేదు. ఇక శారదా నదిపై వున్న గ్రోయిన్ల ఆధునికీకరణ, మరమ్మతులు, కాలువల్లో పూడికతీత పనులను వైసీపీ పాలకులు ఎప్పుడో గాలికొదిలేశారు. మొత్తం మీద ఈ సాగునీటి ప్రాజెక్టులన్నీ ఇద్దరు మంత్రులు, ప్రభుత్వ విప్ ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో వున్నాయని, వీటికి నిధుల కేటాయింపుకు వారిస్థాయిలో కృషి చేయలేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి 'బూడి'కి లేదు

▸▸ ఘాట్ రోడ్డు చూస్తే వైసీపీ పాలనలో అభివృద్ధి అర్థమవుతుంది : టీడీపీ నాయకులు



చీడికాడ : అప్పలరాజుపురంలో సమావేశమైన నాయకులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 7 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును విమర్శించే స్థాయి బూడి ముత్యాలనాయుడుకు లేదని, సవాల్ విసిరినంత సీను కూడా లేదని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. గురువారం వారు ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు, మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడిపై ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని వారు ఖండించారు. కె.కోటపాడు మండలం గొండుపాలెంలో చంద్రబాబు నిర్వహించిన సభకు జనాదరణ చూసి బూడి ముత్యాలనాయుడుకు మతి భ్రమించిందన్నారు. మాడుగుల నియోజకవర్గంలో బూడిపై పోటీ చేయడానికి చంద్రబాబు, లోకేశ్ అవసరం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో సామాన్య రైతును నిలబెట్టినా భారీ మెజార్టీతో గెలుపు తథ్యమన్నారు. మాడుగుల ఘాట్ రోడ్డు చూస్తే వైసీపీ హయాంలో అభివృద్ధి ఏమిటో ఇట్టే అర్థమవుతుందన్నారు. త్వరలోనే టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటు కాగానే వైసీపీ దొంగలు జైలుకు వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, పోతల పాత్రునాయుడు, బండారు రామారావు, రామలింగ స్వామి, బాబూరావు, సత్యవతి పాల్గొన్నారు.

టీడీపీ కార్యక్రమాల నిర్వహణపై చర్చ

చీడికాడ : వైసీపీ పాలనపై ప్రజలు విసుగుచెందారని, మరో రెండు నెలల్లో టీడీపీ అధికారంలో రావడం తథ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై బుధవారం అప్పలరాజుపురం కార్యాలయంలో చర్చించారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలు ఏ విధంగా నిర్వహించాలి, ప్రజల్లోకి ఎలా వెళ్లాలి తదితరాలపై చర్చించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, మాజీ జడ్పీటీసీ కసిరెడ్డి అప్పలనాయుడు, నాయకులు జూరెడ్డి రాము, పైల ముత్యాలనాయుడు, కొల్లి సూరినాయుడు కొల్లి పైడంనాయుడు తదిత రులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న తీరాన్ని పురస్కరించుకొని అభయాంజనేయస్వామిని దర్శించుకొన్నారు. నిర్వాహకులు వీరికి సాదరంగా స్వాగతం పలికారు.

గౌరీపరమేశ్వరుల జాతర ప్రారంభం



బండి ప్రభను ప్రతిష్ఠించిన దృశ్యం

రోలుగుంట, ఫిబ్రవరి 7 : గౌరీపరమేశ్వరుల జాతర బుధవారం ఇక్కడ ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ వేడుక జరగనుంది. ఇందులో భాగంగా సాయంత్రం రామాలయం వద్ద బండి ప్రభ ప్రతిష్ఠతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది జడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, పోతల శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గురువారం చిన్న తీర్థం, శుక్రవారం ముగింపోత్సవం జరుగుతుంది. అదే రోజు రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు.

నేడు రెండు గ్రామాల్లో తీర్థాలు

మాడుగుల, ఫిబ్రవరి 7 : మండలంలోని ద్వారకానగర్‌లో రాములవారి తీర్థం, దొర్లసురవరంలో పసర మోదమ్మ తీర్థం గురువారం జరగనున్నాయి. ఇందుకు సంబంధించి భారీఎత్తున ఏర్పాట్లు చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ముగ్గుల పోటీలు, ఎడ్ల పరుగు పందెం పోటీలతో పాటు గుర్రం పరుగు పందేలు జరగనున్నాయన్నారు.

'10న వైఎస్ షర్మిల పర్యటన'



రచ్చబండ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 7 : పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఈ నెల 10వ తేదీన నర్సీపట్నం పర్యటనలో భాగంగా నాతవరం మండలం ములగపూడిలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని ఏఐసీసీ సభ్యులు, కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రుత్తల శ్రీరామమూర్తి తెలిపారు. బుధవారం పీసీసీ ఉపాధ్యక్షులు మీసాల సుబ్బన్నతో కలిసి ములకపూడిలో రచ్చబండ నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తేదీ శనివారం ఉదయం తొమ్మిది గంటలకు రచ్చబండ కార్యక్రమం ఉంటుందన్నారు. కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సం ఖ్యలో హాజరు కావాల్సిందిగా కోరారు.

బ్రిటీష్ పోలీసుల సమాధులను కాపాడండి

నర్సీపట్నం, ఫిబ్రవరి 7 : బ్రిటీష్ వారిపై అల్లూరి సీతారామరాజు సాయుధ పోరాటానికి నిలువెత్తు సాక్ష్యంగా కనిపిస్తున్న బ్రిటీష్ పోలీస్ అధికారుల సమాధుల స్థలాన్ని ఆటో స్టాండ్‌కు కేటాయించ వద్దని సీపీఐ నాయకులు బాలేపల్లి వెంకటరమణ, గురుబాబు బుధవారం ఆర్డీవో జయరాంను కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణంలోని చెక్కావారి బంకు ఎదురుగా ఉన్న సమాధుల స్థలం ఆటో స్టాండ్‌కు కేటాయించడం ఆపాలన్నారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు మాట్లాడుతూ అటువంటి నిర్ణయమేదీ తీసుకోలేదని ఆర్డీవోకి స్పష్టం చేశారు. సమాధుల స్థలంలో ఆక్రమించి నిర్మించిన మూడు అంతస్తుల భవనం వెంటనే తొలగించాలని సీపీఐ నాయకులు కోరారు. గతంలో చాలాసార్లు దీనిపై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

'హాస్టల్ విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి'

గొలుగొండ, ఫిబ్రవరి 7 : ఎస్సీ హాస్టల్‌లో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు ఎం.అప్పలరాజు కోరారు. మండలంలోని జోగంపేట ఎస్సీ బాలుర వసతి గృహంలో పాతమల్లంపేట పంచాయతీ శివారు బుడ్డపాడు గ్రామానికి చెందిన విద్యార్థి దావీద్‌రాజ్ (12) విద్యుత్ షాక్‌తో మృతిచెందిన విషయం తెలిసిందే. దీనిపై వసతి గృహాన్ని పలువురు విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి సాంఘిక సంక్షేమ, విద్యుత్ శాఖల నుంచి పరిహారం అందించేందుకు ఉన్నతాధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు ఫణీంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆరు లీటర్ల సారాతో మహిళ అరెస్టు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 7 : సారా అమ్ముతున్న మహిళను బుధవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు. కొండపాలెం గ్రామానికి చెందిన ముచ్చకర్ల రామయ్యమ్మ సారా విక్రయిస్తున్నట్టు ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఆరు లీటర్ల సారా పట్టుబడడంతో అరెస్టు చేసి కోర్టుకు తలరించినట్టు చెప్పారు.

'అడిగర్ల' మృతి టీడీపీకి తీరని లోటు : అయ్యన్న

మాకవరపాలెం, ఫిబ్రవరి 7 : ఇటీవల కొండల అగ్రహారంలో మృతిచెందిన టీడీపీ సీనియర్ నాయకుడు అడిగర్ల సత్యనారాయణ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ మృతి పార్టీకి తీరని లోటుగా పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంతా ఆయన అండగా నిలిచారన్నారు. నాయకులు అల్లు రామునాయుడు, సబ్బవరపు రమణ, సుర్ల శంకరరావు, జోగిపాత్రుడు, కేతిరెడ్డి చిరంజీవి పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో చెత్తబుట్టలు పంపిణీ

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 7 : మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో సర్పంచ్ లోచల సుజాత బుధవారం గ్రామంలోని ఇంటికి రెండు చొప్పున చెత్తబుట్టను పంపిణీ చేశారు. తడి- పొడిచెత్తను రోడ్డుపై పారబోయకుండా ఈ బుట్టలలో వేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. కార్యదర్శులు శ్రీనివాస్, రాజేశ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు



చీడికాడ, ఫిబ్రవరి 7 : అప్పలరాజుపురంలో బుధవారం అభయాంజనేయ తీర్థం సందర్భంగా జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. మొత్తం పదహారు జతల ఎడ్లు పాల్గొనగా తొలి మూడు స్థానాల్లో నిలిచిన వాటి యజమానులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, సర్పంచ్ చుక్క అప్పలనాయుడు, డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, కురచా నారాయణమూర్తితో పాటు పలువురు పెద్దలు పాల్గొన్నారు.

రాగి సాగుతో అధిక దిగుబడులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 7 : రైతులు రాగి సాగుపై ఆసక్తి పెంచుకోవాలని అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం రాగిడెమో ప్లాట్ ప్లానింగ్ ఆర్గనైజేషన్ ఆఫీసర్ పి.విజేత సూచించారు. తామరంలోని రైతు భరోసా కేంద్రం వద్ద కొంత భూమిని మడులుగా ఏర్పాటు చేసి, రాగి సాగుకు నాట్లు వేశారు. వీటిని బుధవారం పరిశీలించిన ఆమె మాట్లాడుతూ వేగావతి అనే కొత్త రాగి వంగడాన్ని ఇరవై రోజులలోనే దగ్గర దగ్గరగా నాట్లు వేయడం జరుతుందన్నారు. దీని వల్ల అధిక దిగుబడులు పొందవచ్చనని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసా ఆధికారి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



నూతన వంగడాల నాట్లను వేస్తున్న దృశ్యం

'రైతులపై రాష్ట్ర ప్రభుత్వం కపట ప్రేమ'

▸▸ పంట రుణాలను తక్షణమే మాఫీ చేయాలి

▸▸ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అప్పలరాజు



మాట్లాడుతున్న అప్పలరాజు

చోడవరం, ఫిబ్రవరి 7 : రైతుల రుణాలను మాఫీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం గిట్టుబాటుకాక, పెట్టిన పెట్టుబడులు చేతికి అందక అన్నదాతలు తీవ్ర నష్టాలకు గురవుతున్నారన్నారు. ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగిపోవడంతో పాటు పెట్టుబడులు అధికం కావడంతో అప్పులు చేయాల్సి దుస్థితి నలకొందని వాపోయారు. వైసీపీ ప్రభుత్వం రైతులపై కపట ప్రేమ చూపుతోందని ఆరోపించారు. వారికి అన్నింటా తీరని అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. సోమనాథ్ కమిషన్ సూచనలను అమలు చేయాలని, కేరళ రాష్ట్రంలో మాదిరిగా రైతులకు పంట రుణాలను మాఫీ చేయాలని, సబ్సిడీపై ఎరువులు అందించాలని కోరారు. రైతాంగ సమస్యలపై గురువారం అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నామన్నారు. రైతుంతా పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

105 మందికి కంటి పరీక్షలు

చోడవరం, ఫిబ్రవరి 7 : పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వర ఆలయంలో బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరంలో 105 మందికి కంటి పరీక్షలు జరిపి, 36 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు హరిచందన, అరుణ్‌కుమార్, శ్రీనివాసరావు, రాజీవు లోచన, నర్సింగ్ సిబ్బంది దీపిక పాల్గొన్నారు.

అప్రమత్తంతో అగ్నిప్రమాదాలు దూరం

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 7 : అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఏవిధంగా అప్రమత్తంగా ఉండాలో ఒమ్మలి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటైంది. మాడుగుల అగ్నిమాపక అధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రమాదం జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలి తదితరాలను వివరించారు. అగ్నిమాపక సిబ్బంది, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా రేపు

చోడవరం, ఫిబ్రవరి 7 : స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నర్సింగ్ విద్యార్థులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, నర్సింగ్ కోర్సు చదువుకుని 18నుంచి 27సంవత్సరాల లోపు ఉన్నవారు హాజరుకావచ్చని వివరించారు. వివరాలకు 70363 63272 నెంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

'ఆశ వర్కర్ల అరెస్టు అన్యాయం'

చీడికాడ, ఫిబ్రవరి 7: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అమరావతి వెళుతున్న ఆశ వర్కర్లకు, ప్రజా సంఘాల నాయకులకు పోలీసులు అడ్డంకులు సృష్టించడం తగదని సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడు నాయుడు అన్నారు. బుధవారం పలువురు ఆశ వర్కర్లు, ప్రజా సంఘాల నాయకులకు పోలీసులు నోటీసులు ఇచ్చి అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. కాగా, కోనాం ఆశ వర్కర్ ఆవాల కొండమ్మను అరెస్టు చేసి పూచికత్తుపై విడుదల చేశామని ఎస్ఐ జి.నారాయణరావు తెలిపారు.